www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 14 జులై 2024



'ఎర్రజెండా నీడలో ఏవి వర్మ' అనుభవాలు పుస్తకాన్ని విజయవాడ సమీపంలోని వడ్డేశ్వరం స్కిల్‌డెవలప్మెంట్ సెంటర్‌లో ఆవిష్కరించిన సిపిఎం పోలిట్బ్యూరో సభ్యులు ఎం.ఎ.బేబీ, బీవీ రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, మాజీ ఎంపీ పి.మదు, మాజీ ఎంఎల్‌సి విఠపు బాలసుబ్రమణ్యం, ప్రజాశక్తి ఎడిటర్ బి.తులసీదాస్, పుస్తక రచయిత ఎవి.వర్మ

గంజాయి పై దృష్టి పెట్టాం

డిజిపి ద్వారకా తిరుమలరావు

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: ప్రతి జిల్లాలో పోలీసులకు నేరపరిశోధనపై అవగాహన కల్పిస్తున్నామని, రాష్ట్రవ్యాప్తంగా గంజాయి నిర్మూలనపై ఎక్కువ దృష్టి పెట్టామని రాష్ట్ర డిజిపి ద్వారక తిరుమలరావు తెలిపారు. తిరుపతి పర్యటన భాగంగా స్థానిక పోలీస్ అతిథి గృహంలో శనివారం ఆయన కర్నూల్ రేంజ్, అనంతపురం రేంజ్ ఎస్పీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అనంతపూర్, కర్నూల్ రేంజ్‌లో నేరాల అదుపు, శాంతి భద్రతలను కాపాడే విధానం, స్థానిక సమస్యలపై అన్ని జిల్లాల అధికారులతో కూలంకుషంగా చర్చించామన్నారు. కొంతకాలంగా జిల్లాల్లో ఉన్న సవాళ్లపై చర్చించుకోవడం జరిగిందన్నారు. సమర్థవంతంగా విధులు నిర్వర్తించడానికి అవసరమైన కొన్ని వనరులు సరిగా లేవని, వాటిలో ముఖ్యంగా వాహనాలు పాతబడ్డాయి త్వరలో వాహనాలు సమకూరుస్తామని తెలిపారు. చిన్న చిన్న సర్వీస్ మేటర్సు విషయంలో ఒక ప్లాన్ ప్రకారం వెళ్లి సరి చేసుకుంటామని, సంక్షేమ విషయం సిబ్బందికి బాగా చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో బేసిక్ పోలీస్ బాగా చేయాలని కోరుకుంటున్నామని, పోలీస్ సిబ్బందితోపాటు ఎస్సైలు, సీఐలు, డీఎస్పీలు కూడా బేసిక్ పోలీసింగ్ చేసుకుంటూ ఉండాలని, త్వరలో పోలీసులను రిక్రూట్ చేస్తామని కొంత టైం పడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాన్ని గౌరవించాలని, మానవ హక్కులను గౌరవిస్తూ, చట్టాన్ని దుర్వినియోగం చేయకూడదని, ప్రస్తుతం గంజాయి మీద నూరు రోజులు ప్రణాళిక రూపొందించామన్నారు. గంజాయి మాదకద్రవ్యాలపై ప్రజలకు, చిన్నపిల్లలకు కూడా అవగాహన కల్పించాలన్నారు. ప్రతి జిల్లాల్లో ఉన్న సవాళ్ళను పోలీసులు సమర్ధవంతంగా ఎదుర్కొంటున్నామని, బాలికలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టేందుకు శ్రద్ధ పెడతామన్నారు. అమాయక గిరిజనులను వాడుకుని గంజాయి సాగు చేయిస్తున్నారు. దాని పై ప్రత్యేక దృష్టి సారించి త్వరలోనే అరికడతామన్నారు. గంజా ట్రాన్స్పోర్ట్ ఆపాలని చూస్తున్నామని, ప్రజలకు సమాజానికి జవాబుదారీతనంగా ఉంటామని తెలిపారు. టెక్నాలజీని ఉపయోగించుకొని గంజా పంటను గుర్తించి నిర్మూలిస్తామని, చెక్ పోస్ట్ లను ఏర్పాటు చేస్తామని, గంజా నిర్మూలన కొరకు ఏటీఎఫ్ (యాంటీ టాస్క్ ఫోర్స్) టీములను త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. కొత్త చట్టాల గురించి అన్ని పోలీస్ స్టేషన్లో అవగాహన కార్యక్రమాలు జరిగాయని, ఎర్రచందనం అక్రమ రవాణాపై రెడ్ శాండిల్ టాస్క్ ఫోర్స్ పనిచేస్తుందన్నారు. అనంతపురం రేంజ్ డీఐజీ డాక్టర్ షెముషి బాజ్పేయి, తిరుపతి జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు, అన్నమయ్య జిల్లా ఎస్పీ కృష్ణారావు, కర్నూలు జిల్లా ఎస్పీ కృష్ణకాంత్, కడప జిల్లా ఎస్పి సిద్ధార్థ కౌశల్, సత్యసాయి జిల్లా ఎస్పీ మాధవరెడ్డి, చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు, అనంతపురం జిల్లా ఎస్పీ గౌతమి శాలి హాజరయ్యారు.

తిరునగరిలో.. తిరుపడి సిరిసంత

- ఆర్గానిక్ మేళా ప్రారంభం
- ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతోనే మంచి ఆరోగ్యం
- యువ రైతులు, విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి- తిరుపతి(మంగళం):

ఉరుకుల పరుగుల జీవితంలో ప్రకృతితో ముడిపడిన మానవ జీవితానికి మంచి ఆరోగ్యకరమైన ఆహారం నేడు కనుమరుగు అవుతోంది. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను నేటి సమాజ పౌరులకు తిరిగి అందివ్వాలని మంచి ఉద్దేశంతో కనెక్ట్ 2 ఫార్మర్ అనే సంస్థ ప్రకృతి వ్యవసాయం, గోఆధారిత ఆహార ఉత్పత్తులు, దేశీ విత్తనాలను మహతి కళాక్షేత్రం వేదికగా తిరునగరి ప్రజల ముందుకు తిరుపతి సిరిసంత ఆర్గానిక్ మేళా ద్వారా తీసుకొచ్చారు.

ప్రతినెలలా మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను నేరుగా వినియోగదారుడుకి అందించాలనే లక్ష్యంతో ఈ ఆర్గానిక్ మేళాను నిర్వహిస్తున్నారు. కనెక్ట్2 ఫార్మర్స్ వ్యవస్థాపక నిర్వాహకులు శిల్ప ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను పెంపొందిస్తూ సమాజంలో ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలని లక్ష్యంతో ఈ ఆర్గానిక్ మేళాను నిర్విరామంగా నెలలో రెండు రోజులు కొనసాగిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే కాకుండా తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల నుంచి కూడా ఈ ఆర్గానిక్ మేళాలో దేశవాళీ విత్తనాలు, అరుదైన వనమూలికలను ఇక్కడి స్టాల్స్‌లో ప్రదర్శించారు. దట్టమైన అడవుల్లో సహజ సిద్ధంగా నవరంగులలో ఉండే గింజలను తమిళనాడు సేలం జిల్లాకు చెందిన మురగానందన్ వాటి విశిష్టతను వివరించారు. ఈ ప్రదర్శనకు తిరునగరి ప్రజల నుండి మంచి ఆదరణ లభిస్తోంది. ఆర్గానిక్ మేళా ప్రారంభానికి పెద్దఎత్తున వినియోగదారులు క్యూ కట్టారు.

పిల్లల్లో ప్రకృతిపై...

మారుతున్న కాలానుగుణంగా నేటితరం పిల్లలు ప్రకృతి విశిష్టతను తెలుసుకునేలా అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. శ్రీ వెంకటేశ్వర స్కూల్, వెరిటాస్ సైనిక్ స్కూల్, మేక్ మై బేబీ జీనియస్ స్కూల్, రాయలసీమ స్కూల్ విద్యార్థులు ఈ ఆర్గానిక్ మేళాలో ప్రకృతి పాల్గొని వ్యవసాయ పద్ధతులు, ఉత్పత్తులపై అవగాహన పొందారు. మానవ జీవితానికి ఆహారం ఎంత అవసరమో, ఆ ఆహారాన్ని పండించే రైతు అనుసరించే విధానాలను, నాణ్యమైన పంటల ఉత్పత్తికి అవలంభించాల్సిన పద్ధతులను విద్యార్థులకు వివరించారు. ప్రకృతి వ్యవసాయం పట్ల పెరుగుతున్న ఆదరణ, ఎందుకు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా వచ్చిన ఉత్పత్తులను తీసుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడిందనే అంశాలను వివరించారు. మట్టి బొమ్మలను ఎలా తయారు చేస్తారనే అంశాలపై శిక్షకుడితో మేళాకు హాజరైన పిల్లలకు వారి చేతితోనే దేవతామూర్తుల ప్రతిమలు, వివిధ ఆకృతిలో మట్టి ఆకారాలను తయారు చేయించి పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసే ప్రయత్నం చేశారు. దీంతోపాటుగా టెంకాయచెట్టు ఆకుతో పిల్లల ఆట వస్తువులు ఎలా తయారు చేసుకుంటారో వారికి చూపిస్తూ వారితోనే తయారు చేయించి వారిని అబ్బురపరిచేలా శిక్షకులు శిక్షణ ఇచ్చారు.

జానపద గేయలానపనతో...

- జనపరెడ్డి వెంకటరమణ, దేశవాలి విత్తన విక్రయదారుడు, రాజమహేంద్రవరం

ప్రకృతి ఒడి నుండి విత్తనం మొలకెత్తి పరిపక్వత చాటుకుంటూ భూమిని చీల్చుకొనిపైకి వచ్చే పరిణామాలను జానపద గేయరూపంలో రాజమహేంద్రవరంకు చెందిన జనపరెడ్డి వెంకటరమణ వినియోగదారులకు చక్కగా వివరించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల వలన లభించే ఆహార ఉత్పత్తులను తీసుకోవడం వలన కలిగే మేలును వివరించారు. సనాతన భారతీయ వ్యవసాయ పద్ధతుల ద్వారా పండించిన పంటలతో మన పూర్వీకులు ఎంత స్వచ్ఛమైన ఆరోగ్యంతో బ్రతికారన్న విషయాలను వివరించారు. విత్తనాలను నేడు ప్రాసెసింగ్ చేస్తూ తక్కువ కాలంలో పండించే పంటలుగా చేస్తున్నారని, సహజ సిద్ధంగా ఆహార పదార్థం మనిషికి అందించడమే లక్ష్యంగా అడవిలో నుండి విత్తనాల సేకరణ చేస్తున్నాము. ఈ ఆర్గానిక్ మేళాలో 70 రకాల దేశవాళీ విత్తనాలను అమ్మకాలకు ఉంచాము.

దేశవాలి విత్తనాలకు మంచి ఆదరణ

- ప్రమీల, దేశవాలి విత్తనవిక్రయదారు, జహీరాబాద్, తెలంగాణ

ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలను పండిస్తూ తద్వారా దేశవాలి విత్తనాలను సేకరించి వీటిని విస్తరిస్తున్నాం. తెలంగాణ రాష్ట్రం జహీరాబాద్‌లో ప్రాజెక్టు కేంద్రంగా అరణ్య అగ్రికల్చరల్ ఆల్టర్నేటివ్స్‌గా మేము 70 రకాల ఆహార ఉత్పత్తులకు సంబంధించిన దేశవాలి విత్తనాలను అమ్మకాలు చేస్తున్నాం. కనెక్ట్ 2 ఫార్మర్ ద్వారా నిర్వహింపబడుతున్న ఈ ఆర్గానిక్ మేళాలో మా ఉత్పత్తులను అమ్మకాలు చేసుకుంటున్నాం. ప్రతి ఒక్కరికి మంచి ఆరోగ్యాన్ని అందించాలనే లక్ష్యంతో ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరించే రైతులు, సమాజ హితం కోసం పనిచేసేవారు మాకు చేయూతగా నిలవడం సంతోషంగా ఉంది.

తిరుమలకు చేరుకున్న చీఫ్ సెక్రటరీ, డిజిపి

ప్రజాశక్తి - తిరుమల: తిరుమల శ్రీవారి దర్శనార్థం రాష్ట్ర చీఫ్ సెక్రటరీ నీరభ్ కుమార్ ప్రసాద్, డిజిపి ద్వారకా తిరుమల రావు చేరుకున్నారు. చీఫ్ సెక్రటరీకి టిటిడి ఈఓ జె.శ్యామలరావు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. పద్మావతి అతిథి గృహంలో సీఎస్ కు ప్రత్యేక వసతి ఏర్పాట్లను ఏర్పాటు చేసినట్టు అధికారులు తెలిపారు. రేపు ఉదయం విఐపి దర్శన సమయంలో ఇరువురు స్వామివారి దర్శించుకుంటారని అధికారులు వెల్లడించారు. డిజిపికి పోలీసు అతిథి గృహంలో బస ఏర్పాట్లు చేశారు.

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఘనస్వాగతం

రేణిగుంట: తిరుమల తిరుపతి రెండు రోజుల పర్యటనలో భాగంగా శనివారం సాయంత్రం 5 గంటలకు రేణిగుంట విమానాశ్రయంకు చేరుకున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్‌కు జిల్లా కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్ ఘనంగా స్వాగతం పలికారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ధ్యాన్ చంద్ర, నగరపాలక సంస్థ కమిషనర్ అతిథి సింగ్, డిఆర్ఓ పెంచల్ కిషోర్, ప్రోటోకాల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రశేఖర్ నాయుడు, ల్యాండ్ అండ్ ప్రొటెక్షన్ సెల్ డిప్యూటీ కలెక్టర్ రామ్మోహన్, ఆర్డీఓ శ్రీకాళహస్తి రవిశంకర్ రెడ్డి స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

తిరుపతి ఎస్పీగా ఎల్.సుబ్బరాయుడు

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

తిరుపతి జిల్లా నూతన ఎస్పీగా ఎల్.సుబ్బరాయుడును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి నీరబ్ కుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం తిరుపతి జిల్లా ఎస్పీగా విధులు నిర్వహిస్తున్న హర్షవర్ధన్ రాజును కడప జిల్లా ఎస్పీగా బదిలీ చేశారు. డిజిపి కార్యాలయంలో ఉన్న సుబ్బరాయుడును తిరుపతి జిల్లా ఎస్పీగా బదిలీ చేశారు. ఎర్రచందనం అక్రమ నివారణ టాస్కోర్స్ ఎస్పీగా అదనపు బాధ్యతలను అప్పగించారు. ఈ మేరకు ఒకటి రెండు రోజులు ఆయన బాధ్యతలు స్వీకరించి ఉన్నట్లు సమాచారం.

ఆరేళ్ల చిన్నారిపై లైంగిక దాడి

- వృద్ధుడిపై కేసు నమోదు - పరారీలో నిందితుడు..

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్ : ఏర్పేడు మండలం మునగలపాలెం పంచాయతీ మూల కండ్రిగ గ్రామంలో 6 ఏళ్ల బాలికపై 60 ఏళ్ల వృద్ధుడు (బలరామయ్య) లైంగిక దాడికి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాల్లోకెళ్తే.. ఈనెల 7వ తేదీ చిన్నారి తండ్రి ఉద్యోగానికి వెళ్ళగా అదే సమయంలో చిన్నారి తల్లి కూలిపనికి వెళ్లడంతో ఇదే అదునుగా చూసిన 60 ఏళ్ల మానవ మృగం చిన్నారికి చాక్లెట్‌ను ఆశగా చూపించి ఇంటికి తీసుకెళ్లి లైంగిక దాడి చేసి ఎవరికైనా చెప్తే చంపుతానని బెదిరించాడు. 9వ తేదీన బాలికకు తల్లి స్నానం చేస్తుండగా నొప్పిగా ఉందని చిన్నారి చెప్పడంతో దగ్గరలో ఉన్న పాపానాయుడుపేటలోని ఆర్ఎంపీ డాక్టర్‌కు చూపించడంతో అప్పటికీ నొప్పి తగ్గకపోవడంతో రేణిగుంట బాలాజీ ఆసుపత్రికి తీసుకుని వెళ్లాడారు. అక్కడ డాక్టర్ బాలిక లైంగిక దాడికి గురైందని చెప్పడంతో బాలిక తల్లి ఆపాపను ప్రశ్నించడంతో వచ్చిరాని మాటలతో బాలిక జరిగిన విషయాన్ని చెప్పింది. దీంతో బలరామయ్యపై ఏర్పేడు పోలీస్ స్టేషన్లో చిన్నారి తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో ఏర్పేడు సీఐ శ్రీరామ శ్రీనివాసులు కేసు నమోదు చేయడం జరిగింది. నిందితుడి కోసం శనివారం పోలీసులు మూలకండ్రిగలోని నిందితుడి ఇంటికి వెళ్లి విచారించగా నిందితుడు పరారీలో ఉన్నట్లు సిఐ తెలిపారు. నిందితుడు ఎక్కడ ఉన్నా త్వరలోనే పట్టుకుని కఠిన శిక్షపడేలా చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

కరిముల్లా, సిపిఎం మండ్ల కార్యదర్శి

ఆరేళ్ల బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన 60 ఏళ్ల మానవ మృగం (బలరామయ్య)ను ఎక్కడ ఉన్నా వెంటనే పట్టుకుని కఠినంగా శిక్షించాలని అన్నారు. చిన్నారులపై లైంగిక దాడులు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. చిన్నారిపై జరిగిన లైంగిక దాడిని సిపిఎం నాయకులు రంగయ్య, డివైఎఫ్ఐ నాయకులు రాంబాబు, వెంకటేశ్వర్లు తీవ్రంగా ఖండించారు. నిందితుడిని వెంటనే పట్టుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

మానవ మృగాలను కఠినంగా శిక్షించండి: అంబేద్కర్ స్టార్ కృష్ణ

శ్రీకాళహస్తి: చిన్నారులపై అత్యాచారాలకు పాల్పడుతున్న మానవ మృగాలను కఠినంగా శిక్షించాలని అంబేద్కర్ బహుజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు అంబేద్కర్ స్టార్ కృష్ణ శనివారం ఒక ప్రకటనలో డిమాండు చేశారు. గత ఆదివారం ఏర్పేడు మండలానికి చెందిన బలరామయ్య గౌడ్ (61) ఆరేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడడం హేయమైన చర్య అన్నారు. ఇలాంటి నీచమైన చర్యలను మానవత్వం ఉన్న ప్రతిఒక్కరూ ఖండించాలన్నారు. నిందితులకు శిక్షపడే వరకు పోరాడాలని పిలుపునిచ్చారు.

డెంగీతో విద్యార్థి మృతి

- గురుకుల పాఠశాలను పరిశీలించిన రెవెన్యూ అధికారులు
- అప్రమత్తమైన అధికారులు
- ముమ్మరంగా పారిశుధ్య చర్యలు

ప్రజాశక్తి- డక్కిలి

మండల కేంద్రమైన డక్కిలిలో శనివారం డెంగీ కలకలం సృష్టించింది. డక్కిలిలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న విద్యార్థి షరీనా (11) తీవ్ర జ్వరంతో బాధపడుతుండడంతో కుటుంబీకులు చెన్నై ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందింది. చిన్నారికి అక్కడ వైద్యపరీక్షలు నిర్వహించిన డాక్టర్లు డెంగీ జ్వరంగా ప్రాథమికంగా నిర్ధారించారని, ఇంకా పూర్తిస్థాయిలో నిర్ధారించలేదని కుటుంబసభ్యులు తెలియజేస్తున్నారు. డక్కిలిలో డెంగీ కేసు నమోదు అయ్యిందన్న వదంతులతో వైద్య, రెవెన్యూ అధికారులు అప్రమత్తమయ్యారు విషజ్వరాలపై సమీక్షిస్తున్నారు. విషజ్వరం భారినపడి మృతి చెందిన పాప చదువుకుంటున్న గురుకుల పాఠశాల పరిసరాలను పరిశీలించారు. పాఠశాలలో ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. శానిటేషన్ సిబ్బంది దోమల మందు పిచికారి చేసి, బ్లీచింగ్‌ను చల్లారు. దోమల నివారణకు చర్యలు చేపట్టారు. కాగా ఇదే పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తూ వెంకటగిరికి చెందిన ఓ మహిళ కొన్నేళ్ల కితం డెంగీ బారినపడి మృతిచెందిన విషయం స్థానికంగా చర్చించుకుంటున్నారు. రాష్ట్రంలో కొన్నిరోజులుగా డయేరియా విజృంభణ, సీజనల్ వ్యాధుల వ్యాప్తి ఉన్నా స్థానిక వైద్య ఆరోగ్య సిబ్బంది సమీక్షలతో సరిపెడుతున్నారని క్షేత్రస్థాయిలో చేపడుతున్న చర్యలు శూన్యమని స్థానికులు విమర్శిస్తున్నారు. తీవ్రమైన జ్వరం, కీళ్లనొప్పులు, విరేచనాలు వంటి ఇబ్బందులతో బాధపడుతుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు. మెరుగైన చికిత్స అందిస్తే త్వరగా కోలుకోవచ్చు అని, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటితొట్లపై దోమలు చేరకుండా మూతలు బిగించుకోవాలని, దోమలు గుడ్లు పెట్టేందుకు ఏ మాత్రం ఆస్కారం లేకుండా పాతటైర్లు, కొబ్బరిబోండాలు, కుండీల్లో నీరు నిల్వలేకుండా జాగ్రత్త వహించాలని వారు సూచిస్తున్నారు.

మృతి చెందిన షరీనా (ఫైల్)

గురుకుల పాఠశాల ఆవరణంను పరిశీలిస్తున్న అధికారులు

న్యాయం చేయాలని వినతి

మండల కేంద్రంమైన డక్కిలిలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో పాఠశాల ప్రిన్సిపల్, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా డెంగీ జ్వరంతో మరణించిన విద్యార్థి షరీనా మృతికి బాధ్యులైన పాఠశాల ప్రిన్సిపల్ శ్రీదేవి, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని శనివారం ఎస్సై చౌడయ్యకు మృతురాలి కుటుంబ సభ్యులతో పాటు పలు ప్రజాసంఘాల ప్రతినిధులు వినతి పత్రం అందజేశారు. మృతి చెందిన విద్యార్థిని పెదనాన్న నరేష్ , ఏపీ ప్రజాసంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు గద్దల మునయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు రవి మాదిగ, సి.శివ, మార్పు స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు సి.పవన్ కుమార్, ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ ,బీసీ మైనార్టీ యూనియటెడ్ ఫోరమ్ జాతీయ ఉపాధ్యక్షుడు విజయ్ కుమార్, ఏడీపీఎస్ నాయకుడు మధు, రాష్ట్ర దళితసేన నాయకులు మునిరత్నం వినతి పత్రాన్ని అందజేశారు.

ప్రిన్సిపాల్ శ్రీదేవి నుంచి వివరాలు సేకరిస్తున్న అధికారుల బృందం

మతిలేక డయేరియాకు బలి

- నిర్ధారణలోనూ నిర్లక్ష్యమే..

ప్రజాదృష్టి

ప్రజాశక్తి- తిరుపతి సిటీ:

తమకు ఏమి జరిగిందో తెలీదు. ఎక్కడున్నామో తెలీదు... ఉబికి వస్తున్న మూత్రం..అంతలోనే విరోచనాలు... చుట్టు చేరిన జనాలను చూసి కంగారు. ఏడుస్తున్న కొందరు స్నేహితులు... ఓదార్చుతున్న టీచర్లు... ఇది గత బుధవారం తిరుపతి పాస్ మానసిక వికలాంగుల కేంద్రంలోని దృశ్యాలు. పాచిన ఆహారమో... రకరకాల ఆహారాలు తినడం మూలంగానే అక్కడి విద్యార్థులకు డయేరియా సోకింది. దీన్ని గుర్తించడంలో కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఇద్దరు మానసిక అనాథులు ప్రాణాలు పోగొట్టుకోవడం బాధాకరం.

తిరుపతిలోని పాస్ మానసిక వికలాంగుల ఆశ్రయం 24 సంవత్సరాల క్రితం తిరుపతిలో ఏర్పాటు చేశారు. గతంలో ఎంఆర్ పల్లిలోని న్యూబాలాజీ కాలనీ వద్దనున్న ఈ కేంద్రాన్ని ఆరు సంవత్సరాల క్రితం పద్మావతిపురంలోని పంచాయతీ కార్యాలయానికి సమీపంలోకి మకాం మార్చారు. ఇందులో ఎలాంటి ఆధరణ, బంధువులు, కుటుంబ సభ్యులు ఎవ్వరులేని మానసిక అనాథులు 22 మంది, అందరు ఉండి కూడా అలనాపాలన ఇబ్బంది కావడంతో విధిలేక ఆశ్రమంలో ఉన్నవారు మరో 50మంది. మొత్తం 72మంది మానసిక వికలాంగులు అక్కడ ఆశ్రయం పొందుతున్నారు. 6 సంవత్సరాల నుంచి 45 సంవత్సరాల వయస్సు కల్గిన వారు అక్కడ ఉన్నారు. బయట వ్యక్తులను లోపలకి అనుమతించరు. దీంతో అక్కడ ఏమి జరుగుతుందో తెలీని పరిస్థితి. దీనికి తోడు ప్రభుత్వ అధికారులు పర్యవేక్షణ కూడా కొరవడింది. పంచాయతీ నుంచి వచ్చే నీటి సరఫరా అరాకొరే కావడకంతో విధిలేని పరిస్థితులో నిర్వహకులు బయట నుంచి రోజు రెండు ట్యాంకర్ల నీటిని తొలించుకుంటున్నారు. నిర్వహకులు తమకు అందుబాటులో ఉన్న ఆహారాన్ని అందిస్తూ, సొంతంగా ఓ మెడికల్ ప్రాక్టీషనర్ (ఆర్ఎంపి వైద్యులు)చే అవసరమైన వారికి ప్రథమచికిత్స అందిస్తున్నారు. ఆశా వర్కర్లు సైతం లోనికి వెళ్లరు. అప్పడప్పుడు గేటు వద్దకు వెళ్ళి నిర్వహకులతో మాట్లాడి తిరిగి వస్తుంటారు. పారిశుధ్య కార్మికులు కూడా వారానికి ఒకరోజు ప్రధానగేటు లోపలికి వెళ్లి చెత్తను తీసుకొస్తుంటారు. పద్మావతిపురంలోకి మకాం మార్చాక ఆరు సంవత్సరాలుగా ఒకరంటే ఒక పిహెచ్‌సికి చెందిన వైద్యులు కూడా అటువైపు కన్నెతి చూసుంటే ఒట్టు. ఈ నేపథ్యంలో జూలై 9వ తేది ఒకసారిగా ఉదయం 9 గంటల ప్రాంతంలో ఒకసారిగా అక్కడ అలజడి రేగింది. అంతా హాడావిడి... ఉరుకులు పరుగులు.. కొంతమంది మానసిక వికలాంగులను చేతులపై మోసుకొస్తున్న వారు కొందరు. అందుబాటులో ఉన్న వాహనాల్లో ఆసుపత్రికి తరలించే పనిలో కొందరు. అందుకు కారణం అక్కడ వారికి డయేరియా సోకడంతో వాంతులు, విరోచనాలు విజృంభించడం, అప్పటికే ఇద్దరు మానసిక దివ్యాంగులు డయేరియాకు బలికావడమే. ఈ నెల 5వతేదీ శుక్రవారం రాత్రి నిర్వహకులు పిల్లలకు బోండాలు సరఫరా చేశారు. శనివారం ఉదయం కొంతమంది మానసిక దివ్యాంగులు నిరసంగా కనిపించారు. ఆశ్రమం వైద్యుడికి సమాచారం అందిస్తే అందును అందుబాటులో లేడు. ఆదివారం కొంత మందికి వాంతులు కావడంతో మరోసారి వైద్యునికి సమాచారం ఇచ్చారు. ఆదివారం సాయంత్రం పిల్లలను పరిశీలించి, వారికి మాత్రులు పంపిణీ చేసి వెళ్లిపోయారు. సోమవారం ఉదయం నలుగురికి విరోచనాలు ఎక్కువ కావడంతో తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గణపతి అనే అనాధ మరణించారు. అక్కడ కూడా నిర్లక్ష్యమే. రుయా వైద్యులు మరణించిన వ్యక్తి ఏమైంది.. ఎందుకు చనిపోయాడో నిర్ధరించలేదు. మానసిక వికలాంగుల కదా అని మిన్నకుండిపోయారు. పోస్టుమార్టం కూడా లేకుండా అతని దహనక్రియలు పూర్తి చేశారు. అదే రోజు సాయంత్రం మరో ఆరు మందికి వాంతులు, విరోచనాలు అయ్యాయి. ఆసుపత్రికి తరలించారు. ఐనా నిర్వహకులుకాని, వైద్యులు కానీ అప్రమత్తత మరిచారు. మంగళవారం ఉదయం మరికొంత మందికి విరోచనాలు కావడకంతో రుయా ఆసుప్రతికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతు శేషచలం అనే బాలుడు మృతి చెందాడు. దీంతో ఒకసారిగా అక్కడ భయాందోళనలు చోటు చేసుకుంది. ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు సుమారు 12 మంది విద్యార్థులు తీవ్ర అస్వస్థతో ఆసుపత్రిలో చేరడంతో ఆ విషయం ఆనోట ఈనోట పాకి మీడియా చెవిన పడింది. దీంతో అధికారులు అప్రమత్తం అయ్యారు. పంచాయతీ సిబ్బంది, అధికారులు వెంటవెంటనే ఆశ్రమం చుట్టు పాగింగ్, బ్లీచంగ్ పిచికారీ చేశారు. జిల్లా వైద్యాధికారి ఆదేశాలతో నలుగురు ఏఎన్ఎంలు, ఆశాలను, ఒక వైద్యురాలిని అక్కడికి పంపారు. అప్పటికప్పుడే ప్రాథమిక వైద్యశిబిరాని ఏర్పాటు చేశారు. నాలుగు రోజులుగా వాంతులు, విరోచనాలతో వికలాంగులు ఇబ్బంది పడుతుంటూ అటు నిర్వహకులుగాని, ఒక వ్యక్తి తమ ఆసుపత్రిలో చనిపోయిన అందుకు కారణాలు వెతకి, అప్రమత్తం చేయడంలో వైద్యుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనపడుతోంది. 11 గంటలకు పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ సంఘటన స్థలానికి చేరుకుని పరిస్తితులను ఆరా తీశారు. సాయంత్రం జిల్లా కలెక్టర్ సైతం దీనిపై స్పందించి ఆసుపత్రి, ఆశ్రమాన్ని సందర్శించి, అధికారులతో చర్చించి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. మరుసటి రోజు స్థానిక ఎంఎల్ఏ అధికార పార్టీ నాయకులతో అశ్రమానికి చేరుకుని హడావిడి చేశారు. ఆశ్రమం చుట్టుపక్కల స్వయంగా శుభ్రం చేస్తున్నట్లు పోటోలకు ఫోజులిచ్చారు. ఏదైనా ప్రమాదం జరిగాక హాడవిడి, హంగామ చేయడం కంటే ముందస్తు హెచ్చరికలతో అందర్ని అప్రమత్తం చేసి, అవగాహన కల్పించి, అత్యవసర మందులను అందుబాటులో ఉంచి ఉంటే ఇద్దరి మానిసిక దివ్యాంగులను కాపాడుండొచ్చు. చనిపోయిన తర్వాత హంగామా ఏంటి అంటూ చుట్టుపక్కల వారే ముక్కున వేలేసుకోవడం గమనార్హం. ఇప్పటికైన ప్రభుత్వ యంత్రం, ప్రజాప్రతినిధులు ఇలాంటి కేంద్రాలపై దృష్టిపెట్టి, తరుచూ తనిఖీలు చేస్తూ, వారికి అవసరమైన మౌళిక వసతులు కల్పన కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.

జగన్‌ను కలిసిన మహేందర్ రెడ్డి



ప్రజాశక్తి-గూడూరు టౌన్: ఏపీ మాజీ సీఎం జగ న్మోహన్ రెడ్డిని గూడూరు మండలం నెల్లటూరు గ్రామానికి చెందిన జగనన్న సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, వైసీపీ స్టేట్ జాయింట్ సెక్రటరీ వూటుకూరు మహేందర్రెడ్డి శనివారం తాడేపల్లి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈయన వెంట గూడూరు వైస్ ఎంపిపి శ్రీనివాసులు రెడ్డి ఉన్నారు.

రాజకీయ దాడులు వద్దు

ఎంపీ గురుమూర్తి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రాజకీయాలు ఎన్నికల వరకే చూడాలనీ, అధికారం ఉందని ప్రతిపక్ష కార్యకర్తలపై కక్షపూరిత దాడులు చేయడం సమంజసం కాదని తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి అన్నారు. శ్రీకాళహస్తి మండలం అక్కుర్తి గ్రామంలో శుక్రవారం రాత్రి ఇరు పార్టీల ఘర్షణలో గాయపడి స్థానిక ఏరియా హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న వైసీపీ కార్యకర్త రమేష్‌ను శనివారం ఎంపీ గురుమూర్తి, మాజీ ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి పరామర్శించారు. బాధితుడు రమేష్‌ను ఘర్షణకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. టీడీపీ నాయకులు కక్ష కట్టి దాడులకు పాల్పడుతున్నారనీ, తనను తన కుటుంబాన్ని వేధిస్తున్నారని బాధితుడు రమేష్ ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. పరామర్శ అనంతరం ఎంపీ, మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయ కక్ష సాధింపులు తగమన్నారు. గ్రామాలు ప్రశాంతంగా ఉంచాలనీ, కక్ష సాధింపులతో దాడులు చేసుకుంటూ పోతే గ్రామాలు అశాంతికి నిలయంగా మారుతాయని ఇది మంచి పద్ధతి కాదన్నారు. పోలీసులు తక్షణం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

విశ్వవిద్యాలయాల ప్రక్షాళన చేపట్టండి: టిఎన్ఎస్ఎఫ్

ప్రజాశక్తి-క్యాంపస్: రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాలలో నెలకొన్న అసంఘటిత పరిస్థితులను రూపుమాపి, పరిపాలనలో ప్రక్షాళన తీసుకువచ్చి, పారదర్శకతను, నిష్పక్షపాతంగా పరిపాలన వర్సిటీల్లో ప్రవేశపెట్టవలసిన ఆవశ్యకత ఉందని టిఎన్ఎస్ఎఫ్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రామకృష్ణనాయుడు మంత్రి నారా లోకేష్‌కి విన్నవించారు. ఆయన మాట్లాడుతూ ఎస్వీయూలో ఉన్న పలు రకాల సమస్యలను లోకేష్ దృష్టికి తీసుకువెళ్ళినట్లు వెల్లడించారు.

షిరిడీ సాయి సేవలో ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పట్టణంలోని టీడీ రోడ్డులోని షిరిడీ సాయిని శనివారం ఎమ్మెల్యే ఆదిమూలం దర్శించుకున్నారు. పట్టణానికి చెందిన లక్ష్మణరాజు ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే విచ్చేశారు. ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే గెలుపొందితే 101కొబ్బరికాయలు కొడతానన్న మొక్కును తీర్చుకున్నట్లు లక్ష్మణరాజు తెలిపారు. నాయకులు భాస్కర్ రెడ్డి, అములు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవిద్య కళాశాలకు కొత్త కోర్సులు మంజూరు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పట్టణంలోని శ్రీవిద్యా ఎడ్యుకేషనల్ సొసైటీకు చెందిన కళాశాలలో రెండు సంవత్సరాల ఎంసీఏ మూడు సంవత్సరాల బీసీఏ డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ కంప్యూటర్ కోర్సులు, 5సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ బీబీఎ, ఎంబీఎ మేనేజ్మెంట్ కోర్సులకు 2024-25 విద్యా సంవత్సరానికి గాను ఏఐసీటీఈ న్యూఢిల్లీ వారిచే అనుమతి మంజూరు అయినట్లు కళాశాల చైర్మన్ డాక్టర్ ఉమామహేశ్వర్ తెలిపారు. ప్రస్తుతం సాఫ్ట్వేర్ రంగంలో కంప్యూటర్ కోర్సులకు గల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని తమ కళాశాలలో ఈ కోర్సులు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ఈ కోర్సులు చేసినవారికి సాఫ్ట్వేర్ రంగంలో మంచి ఉద్యోగ అవకాశాలు కలుగుతాయని ఆయన తెలిపారు.

శ్రీసిటీలో 16న మెగా ఉద్యోగ మేళా

ప్రజాశక్తి-సత్యవేడు: నిరుద్యోగ యువతకు శ్రీసిటీలో ఈ నెల16న జరగనున్న మెగా ఉద్యోగమేళాకు సంబంధించి శనివారం ఓ ప్రకటన విడుదలైనది. శ్రీసిటీ, ఎంప్లాయబిలిటీ బ్రిడ్జ్ కంపెనీ సంయుక్త భాగస్వామ్యంతో 'ఫ్లాగ్' పేరిట మెగా ఉద్యోగ మేళా నిర్వహించనున్నారు. వివరాలకు కోసం ఎంప్లాయబిలిటీ బ్రిడ్జ్ సోర్సింగ్ హెడ్ ప్రియా కవిచెల్వన్‌కు 73052 54222 సంప్రదించాలని సూచించారు.

కొత్త నెన్నూరు రోడ్డుకు మరమ్మతులు

➤ పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

నెన్నూరులో రోడ్డుకు మరమ్మతులు చేస్తున్న జేసీబీ

ప్రజాశక్తి-రామచంద్రాపురం: మండలంలోని రామచంద్రాపురం బిపూడి రోడ్డు మార్గంలోని నెన్నూరు నుంచి కొత్త నెన్నూరు రోడ్డును మరమ్మతులు చేపట్టారు. శనివారం ఉదయం రామచంద్రాపురం మండలం మాజీ టిడిపి అధ్యక్షుడు ఆరి లీలామోహన్ నాయుడు తన సొంత నిధులతో ఆ రోడ్డు మరమ్మత్తు పనులను చేపట్టారు. కొత్త నెన్నూరు ఎస్టీ కాలనీ నుంచి గత ప్రభుత్వంలో వైసీపీ నాయకులు చెరువు, గుట్ట ప్రాంతం నుంచి గ్రావెల్‌ను అక్రమంగా టిప్పర్లు, లారీలు, ట్రాక్టర్ల ద్వారా ఆ రోడ్డు మార్గంలో తరలించేవారు. ఆ రోడ్డులో రాత్రింబగళ్లు టిప్పర్లు అధిక మోతాదులో గ్రావెల్ లోడ్ వేసుకొని వాహనాలు నడపడం ద్వారా రోడ్డు గుంతలమయమైంది. గ్రావెల్ అక్రమంగా తరలించుకున్న మట్టి మాఫియా ఆ రోడ్డు మరమ్మతుల గురించి పట్టించుకో లేదు. ఆ రోడ్డులో వాహన చోదకులు ప్రయాణించాలంటే తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో జరిగిన సమీక్ష సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే పులివర్తి నాని దృష్టికి ప్రజలు తీసుకొచ్చారు. ఆ రహదారిలో అక్రమంగా గ్రావెల్‌ను భారీ వాహనాలతో రవాణా చేస్తున్నప్పుడు ప్రజలు ఎందుకో అడ్డుకోలేదని, అప్పుడు వాహనాలు అడ్డుకొని ఉంటే రోడ్లు గుంతల మయం అయ్యేది కాదు కదా..? అని గ్రామస్తులను అడిగారు. గ్రామస్తుల సమస్య పరిష్కారానికి ఆరి లీలా మోహన్ నాయుడు ఎక్స్కవేటర్(జెసిబి), ట్రాక్టర్లను ఏర్పాటు చేసి ఆ రోడ్డుపై ఉన్న మట్టిని తొలగించి, గుంతలను గ్రావెల్‌తో పూడ్చివేశారు. గ్రామం చుట్టుపక్కల ఉన్న చెత్తాచెదారం, మురికి నీటి గుంతలను శుభ్రం చేయించారు. గ్రామస్తులు అంటువ్యాధులు బారిన పడకుండా గ్రామంలోని వీధులలో బ్లీచింగ్ చల్లి, దోమల నివారణకు ఫాగింగ్ చేయించి ఉదారత చాటుకున్నారు. దీంతో గ్రామస్తులు ఎమ్మెల్యే పులివర్తి వెంకట మణి ప్రసాద్(నాని), ఆరి లీలా మోహన్ నాయుడుకి కృతజ్ఞతలు తెలిపారు.

'పేదల భూమిలో పెత్తందార్లు'

ప్రజాశక్తి-తిరుపతి డెస్క్: ఏర్పేడు మండలం వికృతమాల రెవిన్యూ పరిధిలోని మర్రిమంద గ్రామంలో గత ప్రభుత్వంలో జగనన్న కాలనీ పేరుతో పేదలకు ఇండ్లు ఇచ్చి నిర్మాణం చేపట్టడం జరిగింది. ఇక్కడ నివాసం ఉన్న పేదల కోసం జగనన్న కాలనీలో ఒక ఎకరా 12సెంట్లు భూమిని గత ప్రభుత్వం భవిష్యత్తు ప్రజా అవసరాల కోసం స్కూల్ బిల్డింగు, హాస్పిటల్ నిర్మాణం, కమ్యూనిటీ హాళ్లు వగైరాలు నిర్మించడం కోసమని ఈ భూమిని వదిలిపెట్టడం జరిగింది. కానీ గత ప్రభుత్వంలో కొంతమంది రాజకీయ నాయకుల కోసమని ఈ ఒక్క ఎకరా 12సెంట్లు భూమి ఆ పేదల కోసం కాకుండా కొంతమంది రాజకీయ నాయకులకి కార్యకర్తలకు ఇవ్వడం. అందులో కొంతమంది ఒక్కో ప్లాట్ రెండు లక్షల రూపాయలకి అమ్ముకోవడం జరిగిందని ఇది సరైన పద్ధతి కాదని సిపిఎం పార్టీగా ఖండిస్తున్నామని, ఈ భూమిని తిరిగి ఆ కాలనీ వాసుల భవిష్యత్తు అవసరాల కోసం ఖాళీ చేయించి కాలనీవాసులకు ఇవ్వాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కరిముల్లా డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రంగయ్య, డివైఎఫ్ఐ నాయకులు రాంబాబు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల అపూర్వ సమ్మేళనం

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1990-91లో పదోతరగతి చదివిన పూర్వవిద్యార్థులు తమ కుటుంబ సభ్యులతో కలిసి శనివారం తలకోనలో అపూర్వ సమ్మేళనాన్ని నిర్వహించారు. పూర్వవిద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈసందర్భంగా వేర్వేరు వృత్తుల్లో వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు

తమకు పాఠాలు నేర్పిన గురువుల గొప్పతనాన్ని జ్ఞాపకం చేసుకున్నారు. కార్యక్రమంలో జనార్ధన్, తిరుమల బాబు, మధు సూధన్, శేఖర్, నరేంద్ర, రాజేంద్ర, లక్ష్మీపతి, వాణి, యోగరంజని, లత, ఝాన్సీ, కుసుమ, రమాదేవి, శ్రీదేవి, కల్పన, శోభావాణి, అనిత తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బొజ్జలకి సన్మానం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకటసుధీర్ రెడ్డిని ఊరందూరులో శనివారం శ్రీకాళహస్తి డ్రైవింగ్ స్కూల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. డ్రైవింగ్ స్కూల్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శిగా శ్రీకాళహస్తికి చెందిన సోంపల్లి శేఖర్ నాయుడు ఎన్నుకున్నారు. శేఖర్‌నాయుడు శ్రీకాళహస్తి పట్టణంలో శివసాయి మోటార్ డ్రైవింగ్ స్కూల్ నిర్వహిస్తున్నారు. శేఖర్ నాయుడుకు జిల్లా కార్యదర్శి పదవి రావడంతో శ్రీకాళహస్తి శాసన సభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలసి సన్మానం చేశారు.

పెండింగ్ పనుల పరిష్కార దిశగా చర్యలు

ఐఐటిని సందర్శించిన కలెక్టర్ వెంకటేశ్వర్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: ఐఐటిని జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ జిల్లా జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్రతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా పెండింగ్ పనుల వివరాలు తెలుసుకుని త్వరితగతిన పరిష్కారానికి చర్యలు చేపడతామని తెలిపారు. శనివారం ఏర్పేడు వద్ద గల కేంద్ర విద్యాసంస్థ ఐఐటిని కలెక్టర్ జెసితో కలిసి సందర్శించగా ప్రొఫెసర్ డాక్టర్ కేఎన్.సత్యనారాయణ క్యాంపస్ పురోగతిపై వివరించారు. కలెక్టర్ పలు వివరాలు తెలుసుకుని, పెండింగ్ అంశాలు, భూసంబంధిత, ఇతర సమస్యలను త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని డైరెక్టర్‌కు తెలిపారు. సమావేశంలో ఐఐటి డిప్యూటీ రిజిస్ట్రార్ చమన్ మెహతా, అధికారులు పాల్గొన్నారు.

కంటి వైద్యశిబిరం విజయవంతం

ప్రజాశక్తి-కుప్పం టౌన్: కుప్పం పట్టణంలోని పిఇఎస్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతం అయినట్టు లయన్స్ క్లబ్ చైర్‌పర్సన్ డాక్టర్ మహేష్ తెలిపారు. ఈ శిభిరంలో 100మంది కంటి రోగులు పాల్గొన్నారు. వారిని పరీక్షించిన వైద్యులు అందులో 21 మందిని శస్త్ర చికిత్సకు ఎంపిక చేశామాన్నారు. వీరందరికి స్థానిక పి ఇ ఎస్ వైద్య కళాశాల ఆసుపత్రి నందు ఉచితంగా వైద్య సేవలు అందివ్వనున్నట్టు తెలిపారు. ఈ శిభిరానికి విచ్చేసిన వారికి భోజన వసతిని సైతం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు పీజీ సెల్వం, సోమశేఖర్, సెంథిల్ కుమార్, చరణ్, ఆజాద్, శివశంకర్, నితిన్ కుమార్, డాక్టర్ కృష్ణమూర్తి, శివ ప్రసాద్, పి ఈ ఎస్ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

రోబోటిక్ థొరాసిక్ సర్జరీతో మెరుగైన వైద్యం

- అపోలో డాక్టర్ అజయ్ నరసింహన్ వెల్లడి

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: రోబోటిక్ థొరాసిక్ సర్జరీతో ఊపిరితిత్తులు, అన్నవాహిక ద్వారా మెరుగైన వైద్యసేవలు రోగికి అందించవచ్చని చెన్నై అపోలో ఆసుపత్రి రోబోటిక్ థొరాసిక్ సర్జరీ విభాగం సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ అజయ్ నరసింహన్ తెలిపారు. శనివారం తిరుపతి అపోలోకి క్లినిక్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఊపిరితిత్తుల సమస్య వచ్చినప్పుడు నొప్పి లేకుండా రోబోటిక్ థొరాసిక్ సర్జరీతో రోగికి మెరుగైన వైద్యం అందించవచ్చు అని చెప్పారు. చెన్నై అపోలో ఆసుపత్రిలో ఇలాంటి టెక్నాలజీతో వైద్య సేవలు అందించడం వల్ల రోగి త్వరగా కోలుకోవడం జరిగిందని తెలిపారు. ఊపిరితిత్తుల సమస్య చికిత్సల కోసం, క్యాన్సర్ చికిత్స కోసం ఈ పద్ధతిని వినియోగించడం వల్ల రోగులు ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. అన్నవాహిక క్యాన్సర్ ఉన్న రోగులకు ఏసోఫా గే టామీ సంక్లిష్టమైన ప్రక్రియనే రోబోటిక్ సర్జరీ ప్రభావిత భాగాన్ని కచ్చితంగా వాటిని తొలగించడం జరుగుతుందన్నారు. రోబోటిక్ థొరాసిక్ సర్జరీతో ఎంతోమంది రోగులు కోల్పోవడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో అపోలో ఆసుపత్రి మీడియా ప్రతినిధి నవీన్ పాల్గొన్నారు.

తిరుపతి- షిర్డి వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైళ్ల వేళల్లో మార్పు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: తెలుగు రాష్ట్రాల్లో ప్రయాణించే నాలుగు ప్రధాన ఎక్స్‌ప్రెస్ రైళ్ల వేళల్లో మార్పులు చేస్తూ రైల్వే అధికారులు ప్రకటించారు. అక్టోబర్ 18 నుంచి ఈ రైళ్ల వేళల్లో మార్పులు అమల్లోకి రానున్నాయి. రైల్వే అధికారులు ప్రకటించిన వాటిలో సింహపురి, పద్మావతి, నారాయణాద్రి, నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్‌లు ఉన్నాయి. ఈ నాలుగు రైళ్లకు సంబంధించిన కొత్త మార్పులు.. సమాయాలను రైల్వే అధికారులు వెల్లడించారు. సికింద్రాబాద్ - తిరుపతి పద్మావతి ఎక్స్‌ప్రెస్ (12764) ప్రయాణ వేళలు గూడూరు స్టేషన్ నుంచి మారనున్నాయి. గూడూరుకు తెల్లవారు జామున 4.43కి బదులుగా 4.19 గంటలకి చేరుకుంటుంది. తిరుపతి స్టేషన్‌కు ఉదయం 7.15కి బదులుగా 6.55 గంటలకి చేరుకుంటుంది. ప్రయాణ సమయం నాలుగు నిమిషాలు పెరగనుంది. లింగంపల్లి -తిరుపతి నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ (12734) సాయంత్రం 6.25కి బదులుగా సాయంత్రం 5.30గంటలకి బయల్దేరనుంది. తిరుపతికి ఉదయం 7గంటలకు బదులుగా 5.55 గంటకలు చేరుకుంటుంది. ప్రయాణ సమయం 12.35 గంటల నుంచి 12.25 గంటలకు తగ్గనుంది. ఏపీలోని నర్సాపూర్ నుంచి మహారాష్ట్రలోని నాగర్ సోల్‌కి వెళ్లే నాగర్ సోల్ ఎక్స్‌ప్రెస్ (17231) ప్రస్తుతం రాత్రి 11.15కి బయల్దేరి ఉదయం 9.45 గంటలకి చేరుకుంటుండగా.. కొత్త సమయం ప్రకారం రాత్రి 9.50కి బయల్దేరి ఉదయం 7.30గంటలకి చేరుకుంటుంది. ఈ మర్పులు అక్టోబర్18వ తేదీ నుంచి అమల్లోకి రానున్నాయి. సికింద్రాబాద్ - గూడూరు మధ్య నడిచే సింహపురి ఎక్స్‌ప్రెస్ (12710) ప్రస్తుతం సికింద్రాబాద్ నుంచి రాత్రి 10.35 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 9.40గంటలకి గూడూరు చేరుతుంది. సవరించిన ప్రయాణ వేళల ప్రకారం రాత్రి 10.05 గంటలకు సికింద్రాబాద్‌లో ప్రారంభమై ఉదయం 8.55గంటలకు గమ్యస్థానం చేరుకుంటుంది. ఈ రైలు విజయవాడకు వేకువజామున 4.30కి బదులుగా 3.35గంటలకి చేరుతుంది.

వైభవంగా పార్వేట ఉత్సవం

ప్రజాశక్తి రామచంద్రపురం(చంద్రగిరి) మండలంలోని శ్రీనివాస మంగాపురంలోని శ్రీకళ్యాణ వెంకటేశ్వర స్వామి సాక్షాత్కార ఉత్సవాలు ముగింపు సందర్భంగా పార్వేటి ఉత్సవం వైభవంగా జరిగింది. శనివారం ఉదయం శ్రీదేవి భూదేవి సమేత శ్రీకళ్యాణ వెంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలకు పీఠంపై అధిష్టింపజేసి వివిధ రకాల అభిషేకాలు నిర్వహించి పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలు, వివిధ పుష్పాలతో విశేషంగా అలంకరించారు. మంగళ వాయిద్యాలు, వేదమంత్రాలు, భక్త భజనలు, గోవింద నామస్మరణ నడుమ ఊరేగింపుగా శ్రీవారి మెట్లు మార్గంలో ఉన్న పార్వేటి మండపం వద్దకు తీసుకెళ్లారు. పార్వేటి మండపం వద్ద పులులు జింకలు బొమ్మలతో ఏర్పాటుచేసిన వనంలో స్వామి అమ్మవార్లకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. భక్తులు విశేషంగా పాల్గొని స్వామివారికి ధూపదీప నైవేద్యాలు సమర్పించి ముక్కులు తీర్చుకున్నారు. ఈసందర్భంగా పార్వేటి మండపం ప్రత్యేక ఆస్థానం నిర్వహించారు. అనంతరం పార్వేటి మండపం నుండి ఊరేగింపుగా

తీసుకొని కళ్యాణ వెంకన్న స్వామి ఆలయం వద్దకు తీసుకొచ్చారు. ఆలయ ప్రత్యేక శ్రేణి డెప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈఓ గోపినాథ్, సూపరింటెండెంట్లు చెంగల్రాయలు, వెంకట స్వామి, టెంపుల్ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా జగన్నాథ రథయాత్ర

- కిక్కిరిసిన పట్టణ పుర వీధులు

ప్రజాశక్తి-గూడూరు టౌన్: పట్టణంలో శ్రీ జగన్నాథ రథయాత్రను భక్తులు భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. నెల్లూరు ఇస్కాన్ వారి ఆధ్వర్యంలో ప్రతి ఏటా పట్టణంలో జగన్నాథ రథయాత్ర నిర్వహిస్తున్నారు. సొసైటీ ప్రాంతం నుంచి నారాయణమ్మ గుడి వద్ద నుంచి రథయాత్ర ప్రారంభం అయింది. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంలో జగన్నాథుడి విగ్రహాన్ని ఆశీనులను చేసి శాస్త్రోక్తంగా పూజలు చేశారు. అనంతరం ఊరేగింపు నిర్వహించారు. అక్కడి నుంచి ప్రారంభమైన ఈ రథయాత్ర పట్టణ పురవీధుల గుండా శోభాయమానంగా సాగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని హరే రామ హరే కృష్ణ అంటూ భక్తి పారవశంగా పారాయణం చేశారు. స్వామివారిని భక్తులు దర్శించుకుని తీర్థ, ప్రసాదాలను స్వీకరించారు. చిన్నారుల కోలాటం, చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణతో ప్రత్యేకంగా నిలిచారు.

పుత్తూరు టౌన్: పుత్తూరులోని జగన్నాథ రథంలో భక్తులు భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా శనివారం నిర్వహించారు. పుత్తూరు ఎస్బిఐ మెయిన్ బ్రాంచ్ మీదుగా బజార్ వీధి గుండా రథయాత్ర ప్రారంభించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని హరే రామ హరే కృష్ణ అంటూ భక్తి పరవశంగా పారాయణం చేశారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

గూడూరులో అగ్నిప్రమాదం

- దుకాణదారుడుకి భారీ నష్టం
- గూడూరు ఇన్‌ఛార్జ్ అగ్నిమాపక అధికారి విజయ్ కుమార్ వెల్లడి

ప్రజాశక్తి-గూడూరు టౌన్: పట్టణంలోని కుమ్మరవీధిలో ఎన్నో ఏళ్ళుగా ఉన్న సూర్య ఫ్యాన్సీ దుకాణంలో శనివారం వేకువ జామున విద్యుత్ పార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగింది. దీంతో ఒక్కసారిగా మంటలు ఎగిసి పడడంతో పరిసర ప్రాంతాల వారు ఆందోళనకు గురయ్యారు. పోలీసులు అగ్ని మాపక సిబ్బందికి సమాచారం అందించారు. సంఘటనా స్థలికి సకాలంలో చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పేందుకు ఎంతగానో ప్రయత్నించారు. మంటలను అదుపులోకి రాలేదు. అగ్ని మాపక యంత్రంలో నీరు అయిపోయింది. దీంతో మంటలు మరింత వ్యాపించి మూడు అంతస్థుల్లో ఉన్న వస్తువులు కాలిపోయాయి. దట్టమైన పొగ చుట్టుముట్టింది. దుకాణంలో ఉన్న విలువైన వస్తువులు అన్నీ కాలిపోయాయి. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జ్ అగ్ని మాపక అధికారి విజయకుమార్ మాట్లాడుతూ విద్యుత్ షర్ట్ సర్క్యూట్ వలన జరిగిందన్నారు. దుకాణం పూర్తిగా దెబ్బతిందని, రూ.కోటి వరకు ఆస్తి నష్టం జరిగిందని పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలుసున్న ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని షాప్ యజమానితో అగ్ని ప్రమాదంపై ఆరాదీశారు. అనంతరం ప్రభుత్వ పరంగా సాయం అందిస్తామని పేర్కొన్నారు. ఈ ఘటన జరగడం బాధాకరం అన్నారు.

మహిళ దారుణ హత్య

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: తిరుపతి రూరల్ మండలం విద్యుత్ నగర్‌లో వాచ్మెన్ భార్య హత్యకు గురైన సంఘటన శనివారం చోటుచేసుకుంది. ఎంఆర్ పల్లి పోలీసుల కథనం మేరకు.. విద్యుత్ నగర్లో వాచ్మెన్ రామిరెడ్డి నివసిస్తున్నాడు. శనివారం ఉదయం 6గంటలకు గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడ్డారు. ఆ సమయంలో రామిరెడ్డి వ్యక్తిగత పనుల నిమిత్తం కడపకు వెళ్లారు. అందురాలైన కుమార్తెతో రామ్‌రెడ్డి భార్య రెడ్డమ్మ అలియాస్ ప్రసన్న (59)ఇంట్లో ఉన్నారు. ఇంట్లోకి ప్రవేశించిన గుర్తు తెలియని వ్యక్తులు ప్రసన్న గొంతు కోసి హత్య చేశారు. విషయం తెలుసుకున్న తిరుచానూరు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని, అక్కడ పరిస్థితులను పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రుయా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎర్రచందనం స్వాధీనం

పట్టుబడ్డ ఎర్రచందనం చూపుతున్న అటవీ అధికారులు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: భారీగా ఎర్రచందనం స్వాధీనం చేసుకున్నట్లు అటవీ రేంజ్ అధికారి మాధవి తెలిపారు. శనివారం స్థానిక అటవీ కార్యాలయంలో ఆమె వివరాలను వెల్లడించారు. మండలంలోని నేసనూరు పంచాయతీ ద్వారకా నగర్ సమీపంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఎర్రచందనాన్ని గుర్తించామన్నారు. అక్కడే ముగ్గురు నిందితులను గుర్తించామని తెలిపారు. ఇద్దరు అటకాయించి పారిపోగా ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు స్పష్టం చేశారు. సంఘటనా స్థలంలో 372 కిలోల 32 ఎర్రచందనం దుంగలు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. పట్టుబడ్డ నిందితుడిది నేసనూరుకు చెందిన చెంగారెడ్డిగా గుర్తించి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. మరో ఇద్దరికి కోసం గాలింపు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ దాడుల్లో ఫారెస్ట్ అధికారి లోకేష్, ఫారెస్ట్ బీట్ అధికారి అంజూల్ బాషా, నాగయ్య, సిబ్బందులు రవి, భోగరాజు, భాను, నరేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

బతుకుతెరువుకొచ్చి.. మృత్యుఒడిలోకి

- కాంక్రీట్‌లో పనుల్లో కార్మికురాలి మృతి
- మిల్లర్‌లో చీర తగులుకొని ప్రమాదం

ప్రజాశక్తి-సూళూరుపేట: అందరిలానే పొట్టచేత పట్టుకొని బతుకుతెరువుకోసం పట్టణానికి కొచ్చింది ఓ కార్మికురాలు. అప్పటిదాకా తోటి కార్మికులతో కలిసి కాంక్రీట్ పనుల్లో నిమజ్ఞమైంది. టీ విరామం ముగియగానే అనుకోని.. ఊహించని ప్రమాదం జరిగి ఇట్టే మృత్యుఒడిలోకి చేరుకుంది. వివరాల్లోకెళితే.. చిట్టమూరు మండలం కుమ్మరిపాళ్యం గ్రామంకి చెందిన ఎర్రబోతు ఇందిరమ్మ ఎప్పటిలానే తోటి కార్మికులతో కలిసి రోజుకూలీ పనులకు వెళ్లింది. సూళూరుపేట రైల్వే స్టేషన్ వీధిలో కాంక్రీట్ పనులు చేస్తున్నారు. ఆమెతో పాటు అదే గ్రామం నుంచి 20మంది కూలీ పనులకు వచ్చారు. ఉదయం నుంచి సుమారు 11గంటల వరకూ పనులు సాగాయి. అక్కడి వారు కార్మికులకు టీ తెప్పించి ఇచ్చారు. అనంతరం ప్రారంభమైన పనుల్లో ఇందిరమ్మ కాంక్రీట్ మిల్లర్ వద్ద పనులు చేస్తుండగా అకస్మాత్తుగా చీర మిల్లర్లలో చిక్కుకుని చుట్టుకుపోయంది. అందరూ చూస్తుండగానే తల వెంట్రుకలు చుట్టుకొని మిల్లర్‌లో తల, మొండెం వేర్వేరుగా విడిపడి మృత్యువాడ పడింది. ఊహించని విధంగా అందరి కళ్లెదుటే ఇందిరమ్మ ఘోరంగా మృతి చెందడంతో అక్కడ తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అపరిష్కృత అన్నమయ్య సంకీర్తనల పరిష్కారానికి చర్యలు

టీటీడీ ఈవో జె.శ్యామలరావు



ప్రజాశక్తి- తిరుపతి సిటీ: పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల వారు రచించిన 32 వేల సంకీర్తనలలో, కొన్నివేల సంకీర్తనలు మాత్రమే పరిష్కరించబడ్డాయని, ఇంకను అపరిష్కృతంగా ఉన్న సంకీర్తనలను పరిష్కరించి జన బాహుళ్యం లోనికి తీసుకురావాలని టీటీడీ ఈవో జె.శ్యామలరావు అధికారులను కోరారు. తిరుపతి టీటీడీ పరిపాలన భవనంలోని సమావేశ మందిరంలో టీటీడీ ఆల్ ప్రాజెక్టుల అధికారులతో ఈవో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్ని కార్యక్రమాలను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. అన్నమాచార్య సంకీర్తనలకు మరింత ప్రాచుర్యం కల్పించాలన్నారు. ఇప్పటివరకు అన్నమయ్య రచించిన 32వేల సంకీర్తనలలో ఎన్ని సంకీర్తనలు పరిష్కరించారు, ఇంకా ఎన్ని సంకీర్తనలు పరిష్కరించాలి, పరిష్కరించడానికి ఎంత సమయం పడుతుంది అనే అంశాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం దాససాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల్లో నిర్వహిస్తున్న ధార్మిక కార్యక్రమాలను, ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు, నాలాయర దివ్య ప్రబంధ ప్రాజెక్టు, శ్రీనివాస కళ్యాణం మరియు వైభోత్సవాల ప్రాజెక్ట్, ఎస్వీ ఉన్నత వేద అధ్యయన సంస్థ, ఎస్వీ రికార్డింగ్ ప్రాజెక్టు, పురాణ ఇతిహాస ప్రాజెక్టు, మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ ప్రాజెక్టు, శ్రీ సారంగపాణి ప్రాజెక్టు, టీటీడీ ప్రచురణ విభాగంపై సంబంధిత అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఈవోకు వివరించారు. సమావేశంలో జేఈఓ గౌతమి, హెచ్ డిపిపి ప్రోగ్రాం అధికారి రాజగోపాల్, దాస సాహిత్య ప్రాజెక్ట్ ప్రత్యేక అధికారి ఆనంద తీర్థ చార్యులు, అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకులు విభీషణ శర్మ, సంబంధిత ప్రాజెక్టుల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పరీక్షలు

ప్రజాశక్తి-కుప్పం రూరల్: కుప్పం మండలం పరమసముద్రం గ్రామంలోని కేజీబీవి పాఠశాలలో విద్యార్థులకు ప్రతిభా పరీక్షలను నిర్వహించ్చారు. ముఖ్య అతిధిగా కళ్యాణ్ ఫౌండేషన్ సీఈఓ పవన్ కళ్యాణ్ హాజరయ్యారు. ఈ పరీక్షలలో పాఠశాలలోని 8, 9, 10 తరగతులతో పాటు ఇంటర్మీడియట్ విద్యార్థినిలు పాల్గొన్నారు. ఇందులో ఉత్తమ ప్రతిభను కనపరిచిన విద్యార్ధినులకు విద్యా సామాగ్రిని బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో పిఇటి సబితా, ఉపాధ్యాలు తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL CUM X ADDL DISTRICT JUDGE:: TIRUPATI
M.V.O.P.NO:149 OF 2022

P. Damodaram ...Petitioner
Vs
C. Srinivasulu and 2 others ... Respondents

Notice to Respondent No: 1

C.Srinivasulu S/o. C.H.Jogaiah. D.No.555C, M.R. Palli, Tirupati. Tirupati Dist.,

Please take notice that the above M.V.O.P. filed by the Petitioner for claim and the matter is posted to 02.05.2024 for your appearance either in person or through your counsel at about 10:30am in the above court. In theevent of your absence the case will be proceded next step.

Hearing date: 22/07/2024

A. BHOOPATHY
Advocate. Tirupati